


బాల్యం సురక్షితమేనా...?

అనుక్షణం ప్రజల పక్షం RNI NO: TELTEL/2023/87607

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..

WANTED
రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
దిన పత్రికలో పని చేయుటకు
తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని
అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
J V NEWS
ఎడిటర్: బిర్రు కరుణాకర్
Cell:9701249103

సంపుటి - 3 సంచిక -56 బుధవారం 29 జులై 2026 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజిలు 5 వెల - 5/- 01

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

# లీకేజీలకు కారకులను కఠినంగా శిక్షించాలి

అప్పట్లో గ్లోబరీనాపై చర్యలు తీసుకోకపోవడంతో సమస్య

గ్లోబరీనా అక్రమాలు సీబీఎస్ఈకీ విస్తరించాయి

కేసీఆర్ పెట్టిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.8 వేల కోట్లు

ఇకనుంచి సకాలంలో ఫీజుల చెల్లింపునకు చర్యలు

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడి



**న్యూఢిల్లీ,జూలై 28 (జర్నలిస్ట్ వార్త):**
ప్రశ్నపత్రాలలీకేజీలకు కారణమైన వాళ్లను కఠినంగా శిక్షించాలని ముఖ్యమంత్రి .రేవంత్ రెడ్డి అన్నారు. పరీక్షలను ఆన్‌లైన్‌లో నిర్వహించినప్పుడు పెద్దగా సమస్యలు లేవని, ఆఫ్‌లైన్‌లో నిర్వహించినప్పుడే సమస్యలు వస్తున్నాయన్నారు. కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను కలిసిన అనంతరం సీఎం రేవంత్ రెడ్డి విలేకరులతో మాట్లాడారు. అనుమతి లేకుండానే దేశంలో కోచింగ్ కేంద్రాలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయని, అవి ప్రశ్నాపత్రాలు లీక్ అవ్వడానికి వేదికలుగా మారుతున్నాయని సీఎం విమర్శించారు. ఈ విషయంలోజాతీయస్థాయిలో ఒక విధానాన్ని రూపొందించాల్సిన అవసరమున్నదని సీఎం అభిప్రాయపడ్డారు. యూనివర్సిటీల మీద ఆధిపత్యం చెలాయించాలనే ప్రయత్నాన్ని కేంద్ర ప్రభుత్వం మానుకోవాలని సీఎం సూచించారు. విద్యను వీలైనంతవరకు రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోనే ఉంచితే తప్పిదాలకు అవకాశం తక్కువగా**మిగతా 2లో...**

# భవిష్యత్‌లో పేపర్ లీకులకు అడ్డుకట్ట



యాంటీ పేపర్ లీక్ బిల్లుపై మంత్రి జితేంద్ర సింగ్

లీకులకు పాల్పడితే పదేళ్ల జైలు..పది కోట్ల జరిమానా

గతంలో లీకులు జరిగినా చర్యలు తీసుకోని ప్రభుత్వాలు

లోక్‌సభలో బిల్లుపై చర్చలో కేంద్రమంత్రి జితేంద్ర సింగ్



**న్యూఢిల్లీ,జూలై 28 (జర్నలిస్ట్ వార్త):**
భవిష్యత్‌లో పేపర్ లీక్‌లు అరికట్టేందుకే యాంటీ పేపర్ లీక్ బిల్లును తీసుకువస్తున్నట్లు కేంద్రమంత్రి జితేంద్ర సింగ్ స్పష్టం చేశారు. మంగళవారం యాంటీ పేపర్ లీక్ బిల్లుపై లోక్‌సభలో చర్చలో మాట్లాడుతూ.. దేశ చరిత్రలోనే ఈ చట్టం ఒక మైలురాయిగా నిలుస్తుందని జితేంద్ర సింగ్ అభివర్ణించారు. విద్యార్థుల భవిష్యత్ కోసం మోదీ కృషి చేస్తున్నారని వివరించారు. దేశవ్యాప్తంగా**మిగతా 2లో...**

# జనసంద్రమైన సింహాచలం.

ప్రారంభమైన సింహాచలం గిరి ప్రదక్షిణ మహోత్సవం

అప్పన్న నామస్మరణతో కిటకిటలాడుతున్న 32 కి.మీ. మార్గం

10 లక్షల మందికి పైగా పాల్గొంటారని అధికారుల అంచనా

భక్తుల కోసం భారీ ఏర్పాట్లు.. డ్రోన్లతో పోలీసుల పర్యవేక్షణ

స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో అన్నదానం, మంచినీటి పంపిణీ

**సింహాచలంజూలై 28 (జర్నలిస్ట్ వార్త):**
ఆంధ్రప్రదేశ్ లోని ప్రముఖ పుణ్యక్షేత్రం సింహాచలంలో శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామి గిరి ప్రదక్షిణ మహోత్సవం అంగరంగ వైభవంగా కొనసాగుతోంది. సింహాద్రి అప్పన్న నామస్మరణతో గిరి ప్రదక్షిణ మార్గం మార్మోగిపోతోంది. ఆషాఢ పౌర్ణమిని పురస్కరించుకుని ఏటా నిర్వహించే ఈ మహోత్సవంలో పాల్గొనేందుకు లక్షలాదిగా తరలివచ్చిన భక్తులతో **మిగతా 2లో...**



# విజయవాడ, గుంటూరుతో కలిపి చూడాలి

రాజధాని పనుల పురోగతిపై సీఎం చంద్రబాబు సమీక్ష

స్పీడ్, క్వాలిటీ, డెలివరీ లక్ష్యంగా పనిచేయాలని సూచన

పనుల్లో వేగం పెంచాలని కాంట్రాక్ట్ సంస్థలకు ఆదేశం

ఆర్థిక సమస్యలు ఉండవని, ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ

ఇకపై క్షేత్రస్థాయిలో తానే స్వయంగా పనులను పర్యవేక్షిస్తానని వెల్లడి




**అమరావతిజూలై 28 (జర్నలిస్ట్ వార్త):**
రాజధాని అమరావతిని కేవలం 29 గ్రామాల సముదాయంగా మాత్రమే చూడరాదని, విజయవాడ, గుంటూరు నగరాలను కలుపుకొని ఒక బృహత్ ప్రణాళికగా చూడాలని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ రెండు **మిగతా 2లో...**

# రేపిస్ట్‌లను సమర్థించే వ్యక్తికి విద్యాశాఖ

ప్రహ్లాద్ జోషిపై మండిపడ్డ రాహుల్ గాంధీ




# హైడ్రా కార్యక్రమాలను కొనసాగిస్తాం

ఎవరు అధికారిగా ఉండాలో మాకు స్పష్టత ఉంది

కబ్జాలు చేస్తే బడా బాబులైనా, పేదలైనా ఊరుకోం -హైడ్రాపై కావాలనే తప్పుడు ప్రచారాలు

కావాలనే సోషల్ మీడియాతో దుష్ప్రచారాలు -ఢిల్లీలో మీడియాతో సిఎం రేవంత్ రెడ్డి

**న్యూఢిల్లీజూలై 28 (జర్నలిస్ట్ వార్త):**
హైడ్రా పనులు కొనసాగించి తీరుతామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. కబ్జాకోర్లు మాత్రమే హైడ్రా వద్దంటున్నారని పేర్కొన్నారు. ఢిల్లీలో పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి మంగళవారం విలేకర్లతో మాట్లాడారు. కబ్జాలు చేస్తే బడా బాబులైనా, పేదలైనా ఊరుకోమని స్పష్టం చేశారు. గండిపేట,బతుకమ్మ కుంటలను ఆక్రమించింది పేదలా? పెద్దలా? అని విపక్షాలను ఆయన ప్రశ్నించారు. ఎన్ కన్వెన్షన్ పేదలదా? పెద్దలదా? అని వారిని నిలదీశారు.**మిగతా 2లో...**



# డీఎస్సీ అవకతవకలకు ఆస్కారమే లేదు..




అత్యాధునిక భద్రతపై ఏపీ ప్రభుత్వం వివరణ

ఏపీ మెగా డీస్సీ-2025పై ఆరోపణలు

వివరణ ఇచ్చిన కూటమి ప్రభుత్వం

మొత్తం 16,347 ఉపాధ్యాయ పోస్టులకు గాను 15,941 మందికి నియామక పత్రాలు జారీ

టీసీఎస్ ప్లాట్‌ఫామ్‌పై పటిష్ఠ భద్రతతో కంప్యూటర్ ఆధారిత పరీక్షల నిర్వహణ

ప్రశ్నపత్రం లీకేజీ ఆరోపణలను ఖండించిన ప్రభుత్వం, పారదర్శకతకు పెద్దపీట

**2లో.**

# బ్లాక్‌మెయిల్ కోసమే హైడ్రా

: రేవంత్ రెడ్డిపై కేటీఆర్ ఫైర్

హైడ్రా కమిషనర్ గా ఏవీ రంగనాథ్ ను తొలగించాలన్న హైకోర్టు

హైకోర్టు ఆదేశాలు రేవంత్ ప్రభుత్వానికి చెంపపెట్టు అన్న కేటీఆర్

హైడ్రా పేరుతో ఆర్ఆర్ ట్యాక్స్ వసూలు చేస్తున్నారని ఆరోపణ

కాంగ్రెస్ నేతల నివాసాలను ఎందుకు కూల్చడం లేదని ప్రశ్న

**జూలై 28 (జర్నలిస్ట్ వార్త):**
హైడ్రా కమిషనర్‌ను తక్షణమే ఆ పదవి నుంచి తొలగించాలని తెలంగాణ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలు రాష్ట్రం రాజకీయాల్లో తీవ్ర దుమారం రేపాయి. ఈ పరిణామంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఘాటుగా స్పందించారు. హైడ్రాను కాంగ్రెస్ ప్రభుత్వం ఒక బ్లాక్‌మెయిల్ సాధనంగా వాడుకుంటోందని, హైకోర్టు తీర్పు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి చెంపపెట్టు వంటిదని ఆయన విమర్శించారు.**మిగతా 2లో...**



# తెలుగు తేజం సిల్వర్ షో

వెయిట్‌లిఫ్టింగ్‌లో అజయ బాబుకు రజతం

గ్లాస్గో 2026 కామన్‌వెల్త్ క్రీడలు

**గ్లాస్గో (స్కాట్లాండ్)జూలై 28 (జర్నలిస్ట్ వార్త):**
గ్లాస్గో కామన్‌వెల్త్ క్రీడల్లో తెలుగు వెలుగు. తెలుగు తేజం, విజయనగరం జిల్లాకు చెందిన వల్లూరి అజయ బాబు వెయిట్‌లిఫ్టింగ్‌లో రజత పతకం సాధించాడు. సోమవారం అర్ధరాత్రి దాటాక జరిగిన పురుషుల 79 కేజీల వెయిట్‌లిఫ్టింగ్‌లో వల్లూరి అజయ బాబు పతక ప్రదర్శన కనబరిచాడు. స్నాచ్‌లో 149 కేజీలు, క్లీన్ అండ్ జెర్క్‌లో 181 కేజీలు ఎత్తిన అజయ బాబు.. ఓవరాల్‌గా 330 కేజీలు **2లో...**



# తీజ్ వేడుకల్లో ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

## గిరిజన మహిళలతో కలిసి నృత్యాలు.. సంస్కృతి పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్న ఎమ్మెల్యే

**మిర్యాలగూడ/జూలై 28 (జర్నలిస్ట్ వార్త);**
గిరిజనుల ఆచార, సంప్రదాయాలకు ప్రతీకగా నిర్వహించే తీజ్ పండుగ వేడుకలు మిర్యాలగూడ నియోజకవర్గంలో మంగళవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా దామరచర్ల మండలంలోని రాళ్లవాగు తండాలో నిర్వహించిన వేడుకలకు మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి హాజరయ్యారు. గిరిజన మహిళలు, యువతతో కలిసి సంప్రదాయ నృత్యాల్లో పాల్గొని సందడి చేశారు. అనంతరం మాట్లాడుతూ గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలు తెలంగాణ సమాజానికి గొప్ప వారసత్వమని అన్నారు. వాటిని భావితరాలకు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం గిరిజనుల అభివృద్ధితో పాటు వారి సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు



ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. తీజ్ వంటి సంప్రదాయ పండుగలు గిరిజనుల ఐక్యతకు ప్రతీకగా నిలుస్తాయని, ఇటువంటి వేడుకలకు ప్రభుత్వం ఎల్లప్పుడూ ప్రోత్సాహం అందిస్తుందని చెప్పారు. ఈ సందర్భంగా గిరిజన మహిళలు ఎమ్మెల్యేకు



సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, గిరిజన సంఘాల ప్రతినిధులు, మహిళలు, యువకులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అండర్‌పాస్ కోసం జాతీయ రహదారిపై రాస్తారోకో

## శాంతినగర్ గ్రామస్తులు, విద్యార్థుల ఆందోళన

## గంటపాటు నిలిచిపోయిన వాహనాల రాకపోకలు

**ఎల్కతుర్తి/ జూలై 28 (జర్నలిస్ట్ వార్త);**



ఎల్కతుర్తి: జాతీయ రహదారి563 విస్తరణ పనుల్లో భాగంగా శాంతినగర్ గ్రామానికి అండర్‌పాస్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ గ్రామస్తులు, విద్యార్థులు మంగళవారం జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. దీంతో గంటపాటు వాహనాల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయి రెండు వైపులా భారీగా ట్రాఫిక్ నిలిచింది. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ వెలంగిని మేరీ రాయప్ప మాట్లాడుతూ, జాతీయ రహదారి విస్తరణ అనంతరం అండర్‌పాస్ లేకుంటే గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని అన్నారు. గ్రామానికి చేరుకోవాలంటే కోతులనడుమ లేదా పెంచికల్‌పేట మీదుగా చుట్టూ తిరిగి రావాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులు ప్రతిరోజూ పాఠశాలలు, కళాశాలలకు వెళ్లేందుకు, రైతులు తమ వ్యవసాయ పొలాలకు చేరుకోవడానికి జాతీయ రహదారిని దాటాల్సి వస్తోందని, దీంతో నిత్యం ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ప్రమాదాలు జరగకముందే అధికారులు స్పందించి శాంతినగర్ గ్రామానికి అండర్‌పాస్ నిర్మించాలని డిమాండ్ చేశారు. ధర్నా సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని గ్రామస్తులతో చర్చించారు. వారి విజ్ఞప్తిని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇవ్వడంతో గ్రామస్తులు ఆందోళనను విరమించారు. అనంతరం జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలు యథావిధిగా పునరుద్ధరించబడ్డాయి.

# రైతు నేస్తం 100వ ఎపిసోడ్‌కు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్

## - రైతులు, ఏఈఓలకు ఘన సన్మానం.. ఆరుతడి పంటల సాగుపై సూచనలు





**ఎల్కతుర్తి/జూలై 28 (జర్నలిస్ట్ వార్త);**
ఎల్కతుర్తి: రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న రైతు నేస్తం కార్యక్రమం 100వ ఎపిసోడ్ సందర్భంగా ఎల్కతుర్తి రైతు వేదికలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా రైతు వేదికల నుంచి రైతులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు పాల్గొన్నారు. రైతులు తమ పంటల సాగులో ఎదురవుతున్న సమస్యలపై శాస్త్రవేత్తలతో నేరుగా చర్చించి సలహాలు, సూచనలు పొందారు. రైతు నేస్తం కార్యక్రమం 100 ఎపిసోడ్లు విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ రాజు, వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి సురేంద్ర మోహన్, వ్యవసాయ శాఖ డైరెక్టర్ బి. గోపి సచివాలయం నుంచి రైతులను ఉద్దేశించి మాట్లాడారు.

### రైతులకు కలెక్టర్ సన్మానం

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ ఉత్తమ రైతులను సన్మానించారు. ఎల్కతుర్తి మండలం నుంచి కొమ్మిడి రాజిరెడ్డి, హసన్‌పర్తి మండలం నుంచి వన్నెపు బుచ్చిరెడ్డి, దామెర మండలం నుంచి మంద ఎల్లయ్యలను ఘనంగా సత్కరించారు.
అలాగే రైతు నేస్తం కార్యక్రమాన్ని జిల్లాలో సమర్థవంతంగా నిర్వహిస్తున్న ఉత్తమ వ్యవసాయ విస్తరణ అధికారులను కలెక్టర్ అభినందించారు. ఎల్కతుర్తి క్లస్టర్ ఏఈఓ మోడెం పున్నం చందర్, ఆత్మకూరు మండలం పెద్దాపూర్ క్లస్టర్ ఏఈఓ గాజుల ప్రవళికలకు శీల్డులు అందజేశారు.

### ఆరుతడి పంటలపై దృష్టి పెట్టాలి

ఈ సందర్భంగా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొంటున్న నేపథ్యంలో రైతులు తక్కువ నీటితో సాగయ్యే ఆరుతడి పంటల వైపు దృష్టి సారించాలని సూచించారు. నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకొని పంటల ఎంపిక చేసుకోవడం ద్వారా నష్టాలను తగ్గించుకోవచ్చని తెలిపారు.
కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి ఎన్. విజయ్ చంద్ర, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి కమలాకర్ రెడ్డి, శాస్త్రవేత్త నర్సయ్య, హనుమకొండ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు డి. ఆది రెడ్డి, ఆయిల్‌ఫెడ్ డీఎం ఎస్. శంకర్, విశాల సహకార సంఘం చైర్మన్ శ్రీపతి రవీందర్ గౌడ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ భాగ్యలక్ష్మి, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు పుల్లూరి శ్రీధర్ రావు, ఎల్కతుర్తి సర్పంచ్ మునిగడప లావణ్య, వివిధ గ్రామాల సర్పంచులు, అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

# పిచ్చి మొక్కలు తొలగించండి..!

## పశువైద్యశాల ఆవరణలో పాములు, తేళ్ల భయం

## వైద్య శిబిరానికి పాడి పశువులను తీసుకురాలేక రైతుల ఆవేదన





**తల్లాడ/ జూలై 28 (జర్నలిస్ట్ వార్త);**మండలంలోని కేశాపురం గ్రామ పశువైద్యశాల ఆవరణ పిచ్చి మొక్కలు, కలుపు గడ్డితో నిండిపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పశువులకు రక్త పరీక్షలు, దూడలకు అవసరమైన వైద్య పరీక్షల కోసం నిర్వహిస్తున్న శిబిరానికి పాడి పశువులను తీసుకురావడానికే భయపడుతున్నామని రైతులు వాపోతున్నారు. పశువైద్యశాల ప్రహరీ గోడ చుట్టూ మోకాళ్ల లోతు వరకు పిచ్చి మొక్కలు పెరిగిపోవడంతో పాములు, తేళ్లు, ఇతర విషపురుగులు సంచరించే ప్రమాదం ఉందని రైతులు తెలిపారు. శిబిరానికి పశువులను తీసుకొచ్చే సమయంలో తమకూ, పశువులకూ ప్రమాదం పొంచి ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో పలుమార్లు గ్రామ ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లినా ఎలాంటి చర్యలు చేపట్టలేదని రైతులు ఆరోపించారు. పశువైద్యశాలకు వచ్చే రైతులు, పశువుల భద్రతను దృష్టిలో ఉంచుకుని వెంటనే పిచ్చి మొక్కలను తొలగించి ఆవరణను శుభ్రపరచాలని వారు డిమాండ్ చేశారు.

# కోయగూడెం జిపిలో బ్లీచింగ్ పౌడర్ ప్యాకెట్లు పంపిణీ.

## -సర్పంచ్ లింగా నాయక్





**బయ్యారం/,జులై 28.(జర్నలిస్ట్ వార్త)**బయ్యారం మండలం కోయగూడెం గ్రామ పంచాయతీలలో పారిశుద్ధ్యం మెరుగుపరచడానికి,వ్యాధులు రాకుండా ఉండటానికి బ్లీచింగ్ పౌడర్ ప్యాకెట్లను పంపిణీ కార్యక్రమం సర్పంచ్ లింగా నాయక్ ప్రారంభించారు. గ్రామ కార్యదర్శి, సర్పంచ్ పర్యవేక్షణలో పంచాయతీ సిబ్బంది తో కలిసి పంపిణీ ప్రక్రియను చేపట్టారు. ప్రతి ఇంటికి,మురికి వాడలకు బ్లీచింగ్ ప్యాకెట్లు అందించడం ద్వారా నేరుగా పారిశుద్ధ్య పనులకు ఇబ్బంది లేకుండా చేశారు. గ్రామంలో మురుగు కాలువలు, రోడ్లపై శుభ్రత కోసం బ్లీచింగ్ చల్లి దోమలు రాకుండా నివారణ చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి, ఉప సర్పంచ్,వార్డు సభ్యులు,ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# వర్షపు నీటి సంరక్షణను ప్రజా ఉద్యమంగా మార్చాలి

## జలసిరి కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ శేషాద్రి

**ధర్మసాగర్/ హనుమకొండ బ్యూరోజూలై 28 (జర్నలిస్ట్ వార్త)**
వర్షపు నీటి ప్రతి చుక్కను ఒడిసిపట్టి భూగర్భ జలాల పెంపునకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ శేషాద్రి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన జలసిరి కార్యక్రమంలో భాగంగా మంగళవారం ధర్మసాగర్ ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేయనున్న ఇంకుడు గుంత నిర్మాణ పనులను కొబ్బరికాయ కొట్టి, ముగ్గు వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ శేషాద్రి మాట్లాడుతూ, ప్రస్తుతం భూగర్భ జలాల మట్టం క్రమంగా తగ్గుతున్న నేపథ్యంలో వర్షపు నీటిని సంరక్షించడం అత్యవసరమని అన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, గ్రామపంచాయతీలు,



ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసి వర్షపు నీరు భూమిలోకి ఇంకేలా చర్యలు చేపట్టాలని సూచించారు. వర్షపు నీటి సంరక్షణ ద్వారా భవిష్యత్ తరాలకు నీటి కొరత లేకుండా చేయవచ్చని, జలసిరి కార్యక్రమాన్ని ప్రతి గ్రామంలో ప్రజల భాగస్వామ్యంతో విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ధర్మసాగర్ మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ మాచర్ల



జ్యోతిఏలియా మాట్లాడుతూ, గ్రామంలో వర్షపు నీటి సంరక్షణకు అవసరమైన అన్ని చర్యలు చేపడతామని, ప్రతి కుటుంబం ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకుని నీటిని ఒడిసిపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అనిల్ కుమార్ గ్రామపంచాయతీ కార్యదర్శి, ప్రవీణ్ ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు

# కొత్తపేటలో నూతన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు.

## -సర్పంచ్ భూక్యా ప్రవీణ్ నాయక్.



**బయ్యారం/,జులై 28.(జర్నలిస్ట్ వార్త)**బయ్యారం మండలం కొత్తపేట పంచాయతీలో 7వ వార్డులో విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడుతుండటంతో ప్రజల ఇబ్బందులను గుర్తించిన వార్డు సభ్యురాలు పసుపులేటి స్రవంతి సమస్యను గ్రామ సర్పంచ్ భూక్య ప్రవీణ్ నాయక్ దృష్టికి తెచ్చారు. వెంటనే స్పందించిన సర్పంచ్ భూక్య ప్రవీణ్ నాయక్ సంబంధిత విద్యుత్ శాఖ అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లి 25 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయించి సమస్యను పరిష్కరించారు. అనంతరం నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలను సర్పంచ్ భూక్య ప్రవీణ్ నాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామ ప్రజలకు మెరుగైన విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఈ కోటేశ్వరరావు, డిఈ హరిలాల్,ఏడిఈ రమేష్,ఉప సర్పంచ్ రావి వీరభద్రం,వార్డ్ సభ్యులు స్రవంతి,ఏఈ రఫీఉద్దీన్,సబ్ ఇంజనీర్ సందీప్,లైన్ మెన్ సాగర్,కాంగ్రెస్ నాయకులు ధనసరి వీరభద్రం,దేశిని రాంబాబు,రవి మోహన్,శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# కిష్టారం సైలో బంకర్ తొలగించాలి

## బుగ్గపాడు ఫుడ్‌పార్క్ అక్రమాలపై విచారణ తప్పదు: పొంగులేటి సుధాకర్‌రెడ్డి

**సత్తుపల్లి/ జూలై 28 (జర్నలిస్ట్ వార్త)**
సత్తుపల్లి మండలం కిష్టారం గ్రామ సమీపంలో సింగరేణి ఏర్పాటు చేసిన సైలో బంకర్ కారణంగా గ్రామ ప్రజలు తీవ్ర కాలుష్య సమస్యలు ఎదుర్కొంటున్నారని బీజేపీ జాతీయ నాయకుడు పొంగులేటి సుధాకర్‌రెడ్డి అన్నారు. సైలో బంకర్‌ను వెంటనే తొలగించాలని, లేదంటే గ్రామ ప్రజలకు సురక్షిత ప్రాంతంలో పునరావాసం కల్పించాలని ప్రభుత్వాన్ని, సింగరేణి యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరు కోటేశ్వరరావు, రాష్ట్ర అధికార ప్రతినిధి నంబూరి రామలింగేశ్వరరావుతో కలిసి గ్రామాన్ని సందర్శించిన ఆయన బాధితుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బొగ్గు ధూళి కారణంగా శ్వాసకోశ వ్యాధులు పెరిగాయని, భూగర్భ జలాలు కలుషితమై తాగునీటి



సమస్య ఏర్పడిందని గ్రామస్థులు వివరించారు. గతంలో పునరావాసం కల్పిస్తామని హామీ ఇచ్చినా ఇప్పటివరకు అమలు కాలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ ప్రజల ప్రాణాల కంటే ఏ సంస్థకూ లాభాలు ముఖ్యమవ్వకూడదన్నారు. ఈ సమస్యను కేంద్ర బొగ్గు శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. అనంతరం సత్తుపల్లిలో జరిగిన విలేకరుల



సమావేశంలో బుగ్గపాడు ఫుడ్‌పార్క్ భూ కేటాయింపుల్లో అక్రమాలు జరిగాయని ఆరోపించారు. ఈ వ్యవహారంపై త్వరలోనే విచారణ జరుగుతుందని, అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. స్థానిక రైతులు, యువతకు ఉపయోగపడేలా కొత్త టెండర్లు ఆహ్వానించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## ఆయిల్ పామ్ ఆదర్శ రైతుకు సత్కారం.





**బయ్యారం/,జులై 28.(జర్నలిస్ట్ వార్త)**జిల్లా రైతువేదికలో రైతునేస్తం కార్యక్రమం విజయవంతంగా 100వ సంచిక పూర్తి చేసుకున్న సందర్భంగా బయ్యారం మండలం గంధంపల్లి గ్రామానికి చెందిన ఆదర్శ ఆయిల్ పామ్ రైతు వాంకుడోత్ వీర్యా ని జిల్లా వ్యవసాయ శాఖ ప్రత్యేకంగా సన్మానించి ప్రశంసాపత్రం అందజేశారు.ఆయిల్ పామ్ సాగులో ఆధునిక సాగు విధానాలను అనుసరిస్తూ రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నందుకు ఈ పురస్కారం అందజేసినట్లు అధికారులు తెలిపారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్,జిల్లా వ్యవసాయ అధికారి రైతును అభినందిస్తూ ఆయిల్ పామ్ వంటి అధిక ఆదాయం అందించే పంటలను రైతులు విస్తృతంగా సాగు చేయాలని సూచించారు.ఈ సందర్భంగా బయ్యారం మండల వ్యవసాయ అధికారి కే.రాజు వాంకుడోత్ వీర్యా కి అభినందించారు.వ్యవసాయ అధికారి మాట్లాడుతూ మండలంలోని రైతులు కూడా ఆయిల్ పామ్‌తో పాటు ఇతర ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించి వ్యవసాయాన్ని మరింత లాభదాయకంగా మార్చుకోవాలని కోరారు.

## ఎన్టీఆర్ విగ్రహావిష్కరణకు ముస్తాబవుతున్న తల్లాడ, కల్లూరుటీడీపీ శ్రేణుల విస్తృత ఏర్పాట్లు



**తల్లాడ/జూలై 28 (జర్నలిస్ట్ )**వార్తతల్లాడ, కల్లూరు మండలాలతో పాటు బిల్లుపాడు గ్రామంలో తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు విగ్రహావిష్కరణకు ఏర్పాట్లు వేగవంతమయ్యాయి. కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు టీడీపీ నాయకులు విస్తృతంగా సన్నాహాలు చేస్తున్నారు.టీడీపీ నాయకులు మాట్లాడుతూ.. పార్టీ ఆవిర్భావం నుంచి ఎన్టీఆర్ సామాజిక న్యాయం, పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు రాజకీయంగా ప్రాధాన్యం కల్పించారని గుర్తు చేశారు. ఆయన ఆశయాలను భావితరాలకు చాటిచెప్పే ఉద్దేశంతో విగ్రహాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.త్వరలో జరిగే విగ్రహావిష్కరణ కార్యక్రమానికి రాష్ట్రంలోని పలువురు ప్రముఖ టీడీపీ నాయకులు హాజరుకానున్నట్లు వెల్లడించారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు పార్టీ శ్రేణులు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు.విగ్రహావిష్కరణ ఏర్పాట్లను తల్లాడ, కల్లూరు మండలాల టీడీపీ నాయకులు పరిశీలించి, కార్యక్రమం విజయవంతానికి అవసరమైన ఏర్పాట్లపై చర్చించారు.

# వాన కోసం ఎదురుచూపులు...

## వర్షాభావంతో విలవిల్లాడుతున్న రైతాంగం

**ప్రకృతి కరుణిస్తేనే పంట... లేకుంటే అప్పుల ఊబిలో అన్నదాత : ఖరీఫ్ సీజన్ సంక్షోభంలో... ప్రభుత్వానికి పరీక్షా సమయం**



వ్యవసాయం భారతదేశ ఆర్థిక వ్యవస్థకు మూలస్తంభం. దేశ జనాభాలో అత్యధిక మంది ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారు. రైతు కష్టించి పండించిన పంటే కోట్లాది మంది ఆకలి తీర్చుతోంది. అలాంటి రైతు నేడు ప్రకృతి వైపరీత్యాల కారణంగా తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాడు. ముఖ్యంగా వర్షాభావ పరిస్థితులు రైతాంగాన్ని కోలుకోలేని దెబ్బతీస్తున్నాయి. సమయానికి కురవాల్సిన వర్షాలు కురవకపోవడం, కురిసినా ఆశించిన స్థాయిలో లేకపోవడం వల్ల ఖరీఫ్ సాగు అనిశ్చితిలో పడింది. గ్రామాల్లో రైతు ముఖంలో ఆనందం కనిపించాల్సిన సమయంలో ఆందోళన నిరాశ, భవిష్యత్తుపై భయం కనిపిస్తోంది.వర్షాల కోసం ఆకాశం వైపు ఎదురు చూస్తూ రోజులు గడుపుతున్న రైతుకు ప్రతి మేఘం ఆశను కలిగిస్తోంది. కానీ ఆ ఆశ చినుకుగా మారకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయి. ఇప్పటికే విత్తిన వరి, పత్తి, మొక్కజొన్న, కంది, పెసర, సోయాబీన్ వంటి పంటలు నీటి కొరతతో ఎదుగుదల లేక నిలిచిపోయాయి. కొన్ని ప్రాంతాల్లో మొలకలు కూడా రాక రైతులు మళ్లీ విత్తనాలు వేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీనివల్ల పెట్టుబడి రెండింతలు పెరిగి రైతు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నాడు.

రైతు వ్యవసాయం ప్రారంభించే ముందు విత్తనాలు కొనుగోలు చేస్తాడు. ఎరువులు, పురుగుమందులు, ట్రాక్టర్ దున్నింపు, కూలీల ఖర్చు కోసం బ్యాంకులు, సహకార సంఘాలు, ప్రైవేట్ వడ్డీ వ్యాపారుల వద్ద నుంచి రుణాలు తీసుకుంటాడు. పంట బాగా పండితేనే ఆ అప్పులు తీర్చగలడు. కానీ వర్షాభావం కారణంగా పంటలు చేతికిరాకపోతే రైతు ఆర్థికంగా పూర్తిగా కుదేలవుతున్నాడు. కుటుంబ పోషణ, పిల్లల చదువులు, వైద్య ఖర్చులు, రుణాల వడ్డీలు అన్నీ ఒకేసారి భారంగా మారుతున్నాయి.వర్షాభావ ప్రభావం కేవలం పంటలకే పరిమితం కాదు. చెరువులు, కుంటలు, కాలువలు ఎండిపోవడం వల్ల భూగర్భ జలాల మట్టం కూడా గణనీయంగా పడిపోతోంది. బోర్లు ఎండిపోవడంతో సాగునీరు అందక రైతులు నిరాశ చెందుతున్నారు. ఒకప్పుడు పుష్కలంగా నీరు ఇచ్చిన బోర్లు నేడు గంటల తరబడి నడిపినా నీటి చుక్క కనిపించని పరిస్థితి నెలకొంది. దీంతో ప్రత్యామ్నాయ సాగు కూడా కష్టసాధ్యమవుతోంది.పశుసంపదపై కూడా వర్షాభావం తీవ్ర ప్రభావం చూపుతోంది. పచ్చిక బయళ్లు లేక పశువులకు మేత దొరకడం లేదు. చెరువులు ఎండిపోవడంతో తాగునీటి సమస్య ఏర్పడుతోంది. పాలు ఇచ్చే పశువుల ఉత్పత్తి తగ్గిపోవడం వల్ల పాల రైతుల ఆదాయం కూడా పడిపోతోంది. గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో పశుపోషణ కీలకమైన రంగం కావడంతో ఈ ప్రభావం మరింత తీవ్రంగా కనిపిస్తోంది.వ్యవసాయ కూలీల పరిస్థితి కూడా దయనీయంగా మారుతోంది. పొలాల్లో పనులు లేక ఉపాధి కోల్పోయిన వేలాది మంది కూలీలు పట్టణాలకు, ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. దీంతో గ్రామాల్లో ఉపాధి సంక్షోభం మరింత తీవ్రమవుతోంది. వ్యవసాయం దెబ్బతింటే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ మొత్తం కుదేలవుతుందనే వాస్తవాన్ని గుర్తించాల్సిన అవసరం ఉంది.వాతావరణ మార్పులు కూడా రైతాంగానికి పెద్ద సవాలుగా మారాయి. గతంలో ఒక నిర్దిష్ట కాలంలో కురిసే వర్షాలు ఇప్పుడు అనిశ్చితంగా మారాయి. ఒకేసారి భారీ వర్షాలు, ఆ తర్వాత దీర్ఘకాలం వర్షాభావం కొనసాగడం వల్ల పంటల ప్రణాళికలు దెబ్బతింటున్నాయి. ఈ పరిస్థితుల్లో రైతులకు శాస్త్రీయ వ్యవసాయ విధానాలపై అవగాహన కల్పించడం, వాతావరణ సూచనలను గ్రామస్థాయికి చేరవేయడం అత్యంత అవసరం.ప్రస్తుత పరిస్థితుల్లో ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలి. వర్షాభావ పరిస్థితులను నిరంతరం సమీక్షించి అవసరమైన ప్రాంతాలను వెంటనే వర్షాభావ మండలాలుగా ప్రకటించాలి. పంట నష్టాన్ని శాస్త్రీయంగా అంచనా వేసి రైతులకు నష్టపరిహారం అందించాలి. పంట రుణాల గడువును పొడిగించడం, వడ్డీ మాఫీ, ఇన్‌పుట్ సబ్సిడీ, ఉచిత విత్తనాలు, పశువులకు మేత కేంద్రాలు ఏర్పాటు వంటి చర్యలు వెంటనే అమలు చేయాలి. ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో పనులు కల్పించి వ్యవసాయ కూలీలకు ఆదుకోవాలి.

దీర్ఘకాలిక పరిష్కారాలపై కూడా ప్రభుత్వం దృష్టి సారించాలి. చెరువుల పునరుద్ధరణ, వర్షపు నీటి సంరక్షణ, కాలువల ఆధునీకరణ, డ్రిప్, స్ప్రింక్లర్ వంటి సూక్ష్మ సాగునీటి పద్ధతులకు ప్రోత్సాహం, ఎత్తిపోతల పథకాల సమర్థ నిర్వహణ, నీటి వినియోగంపై అవగాహన పెంపు వంటి చర్యలు భవిష్యత్తులో వర్షాభావ ప్రభావాన్ని తగ్గించగలవు.

రైతు బతికితేనే దేశం బతుకుతుంది. అన్నదాత సంక్షేమమే ఆహార భద్రతకు మూలాధారం. రైతు కష్టానికి గౌరవం ఇవ్వడం, అతని ఆర్థిక భద్రతను కాపాడడం ప్రతి ప్రభుత్వ బాధ్యత. ప్రకృతి ఎప్పుడు ఎలా మారుతుందో మన చేతిలో లేకపోయినా, ప్రకృతి విపత్తులతో నష్టపోయిన రైతును ఆదుకోవడం మాత్రం పాలకుల చేతిలో ఉంది. రైతు కన్నీరు తుడిచే చర్యలే నిజమైన సంక్షేమ పాలనకు నిదర్శనం. వర్షాభావం రైతు జీవితాన్ని శాశ్వత సంక్షోభంగా మార్చకుండా ఇప్పటికైనా సమగ్ర కార్యాచరణతో ముందుకు సాగాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అన్నదాత బలంగా ఉంటేనే గ్రామం బలపడుతుంది, గ్రామం బలపడితేనే దేశం అభివృద్ధి చెందుతుంది.



సీనియర్ జర్నలిస్ట్‌కొట్టే సుధాకర్ (లెనిన్)
టి.యు.డబ్ల్యు.జే. (ఐ.జె.యు.) జిల్లా
కార్యవర్గ సభ్యులు సెల్: 9908401581

## మహిళా సంఘాల బలోపేతమే ప్రభుత్వ లక్ష్యం

**మిగిలిన వీఓ భవనాలకు త్వరలో నిధులు: సర్పంచ్ బిల్లా యాదగిరి**





**వేలేరు/ జూలై 28 (జర్నలిస్ట్ వార్త):**
మహిళల ఆర్థిక స్వావలంబన, సాధికారత కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యంతో సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని వేలేరు మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు బిల్లా యాదగిరి అన్నారు. వేలేరు మండల కేంద్రంలో శ్రీ కృష్ణవేణి పరస్పర సహాయక పొదుపు సంఘం (వీఓ) మహిళా సంఘం 22వ వార్షిక మహాసభను మంగళవారం సంఘం అధ్యక్షురాలు మమత అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సర్పంచ్ బిల్లా యాదగిరి మాట్లాడారు.ఎమ్మెల్యే కడియం శ్రీహరి సహకారంతో వేలేరు గ్రామంలోని నాలుగు వీఓ సంఘాల్లో ఇప్పటికే రెండు సంఘాలకు భవనాల నిర్మాణం పూర్తయ్యిందని, మిగిలిన రెండు వీఓలకు కూడా త్వరలో నిధులు మంజూరు చేసి భవనాలు నిర్మిస్తామని తెలిపారు. మండల సమాఖ్య భవనం నిర్మాణాన్ని కూడా త్వరలో చేపడతామని చెప్పారు.ప్రతి ఇంటి ఆవరణలో ఇంకుడు గుంత, ప్రతి రైతు తన వ్యవసాయ భూమిలో పంట కుంట ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఇంకుడు గుంత నిర్మాణానికి గ్రామపంచాయతీ ద్వారా రూ.6,500 ప్రోత్సాహకాన్ని అందజేస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి సహకారంతో గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తూ, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేస్తున్నామని పేర్కొన్నారు.

అనంతరం మహిళా సంఘం కార్యవర్గ సభ్యులు సర్పంచ్ బిల్లా యాదగిరిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మండల ఏపీఎం అనిత, ఉపసర్పంచ్ శ్రీకర్, గ్రామపంచాయతీ కార్యదర్శి విజయ, సీసీ రమాదేవి, వీఓఏ రాజు, వీఓ కార్యవర్గ సభ్యులు, మహిళా సంఘాల సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## గ్రామ సమస్యలను పరిష్కరించేందుకు చొరవ చూపాలి

**సర్పంచులకు సూచించిన స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శేషాద్రి**



**ధర్మసాగర్ /హనుమకొండ బ్యూరో జూలై 28 (జర్నలిస్ట్ వార్త): ం**
గ్రామాల్లో నెలకొన్న సమస్యలను గుర్తించి వాటిని ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకువచ్చి దశలవారీగా పరిష్కరించుకునేందుకు సర్పంచులు చొరవ చూపాలని హనుమకొండ జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శేషాద్రి సూచించారు. ధర్మసాగర్ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం ఎంపీడీవో అనిల్ కుమార్ అధ్యక్షతన మండలంలోని 17 గ్రామాల సర్పంచులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన అదనపు కలెక్టర్ శేషాద్రి మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుద్ధ్యం, తాగునీరు, అభివృద్ధి పనులు తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.ప్రజలకు అందాల్సిన ప్రభుత్వ పథకాలు సక్రమంగా అమలయ్యేలా ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు. గ్రామాల్లో ఉన్న సమస్యలను ఒకేసారి కాకుండా ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అనిల్ కుమార్, మండల అధికారులు, గ్రామాల సర్పంచులు పాల్గొన్నారుం

## పిచ్చిరొట్టెనుతొలగించాలంటున్న,పాడి పశువులు



**తల్లాడ/జూలై 28 (జర్నలిస్ట్ వార్త);**మండలంలోని పరిధిలో కేశపురం గ్రామంలో పశువులకు రక్త పరీక్షలు, దూడలకు నత్తల వివిధ పరీక్షలు నిమిత్తం రైతులు పశువులు వైద్యశిబిరానికి రావాలంటే రైతులు పాడి గేదలు భయపడుతున్నాయి మోకాళ్ళ లోతు గడ్డి పిచ్చి రొట్ట పేరుకు పోవడం వల్ల వైద్య శిబిరానికిగేదెలు మేము అంటున్నాయిరైతులు కూడా వైద్య కాంపౌండ్ వాల్ చుట్టూ భయంకరంగా పిచ్చి రొట్ట గడ్డి ఉండటం వల్లపాములు తేళ్లు విషపు పురుగులు మమ్మల్ని మా గేదెలను కాటు వేసే ప్రమాదం ఉందని మళ్లీ ఆసుపత్రి చుట్టూ పశువులు వైద్య శిబిరం చుట్టూ తిరగాల్సి ఉంటుందని రైతులు చెబుతున్నారు వివరాల్లోకెళితే గతంలో పశు వైద్యశాల, ఏర్పాటు చేశారు కానీ ఈ శిబిరానికి చుట్టుపక్కల పిచ్చిరోట పేరుకు పోవడంతో ప్రమాదం ఉంచు ఉందని పలుమార్లు గ్రామ ప్రథమ పౌరుడు కి రైతులు చెప్పి ఉన్నారనిపాడిగేదెలు అనుకుంటున్నారు

## ముత్తారంలో భూముల రీసర్వేపై అవగాహన సదస్సు

**రీసర్వేతో స్పష్టమైన హద్దులు.. భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం: తహసీల్దార్ రాజేష్**



**భీమదేవరపల్లి/జూలై28 (జర్నలిస్ట్ వార్త):**
హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముత్తారం గ్రామంలో భూముల రీసర్వే కార్యక్రమంపై మంగళవారం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద అవగాహన సదస్సు నిర్వహించారు. రెవెన్యూ, సర్వే శాఖ అధికారుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి తహసీల్దార్ రాజేష్ ముఖ్య అతిథిగా హాజరై రైతులకు రీసర్వే ప్రక్రియ, ప్రయోజనాలపై వివరించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రాజేష్ మాట్లాడుతూ, తెలంగాణ ప్రభుత్వం భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపడం, ప్రతి భూమికి స్పష్టమైన హద్దులు నిర్ణయించడం లక్ష్యంగా రాష్ట్రవ్యాప్తంగా భూముల రీసర్వే కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. ప్రతి భూమికి ప్రత్యేక భూధార్ సంఖ్య కేటాయించి, ఆధునిక డీజీపీఎస్, రోవర్ సాంకేతికతతో అత్యంత ఖచ్చితంగా సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రీసర్వే పూర్తైన అనంతరం ప్రతి భూమికి ప్రత్యేక మ్యాప్ రూపొందించి, భూ భారతి పోర్టల్‌లో డిజిటల్ రికార్డులు నమోదు చేయనున్నట్లు చెప్పారు. దీంతో రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ ప్రక్రియలు సులభతరం కావడంతో పాటు భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు. రైతులు తమ భూముల సరిహద్దులను చూపిస్తూ, పొరుగు రైతులతో కలిసి రీ-సర్వే ప్రక్రియకు పూర్తి సహకారం అందించాలని కోరారు. సర్వే ఫలితాలపై అభ్యంతరాలు ఉంటే ఆర్డీవో, అనంతరం జిల్లా స్థాయి అధికారులకు అప్పీల్ చేసుకునే అవకాశం ఉందని వివరించారు. ప్రభుత్వం ఎలాంటి అదనపు రుసుములు లేకుండా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఇంచార్జ్ సర్పంచ్ మాట్ల హరికుమార్, ఆర్ఐ శ్రీధర్, సర్వేయర్ విజయ్ భాస్కర్, రెవెన్యూ సిబ్బంది రాజు, రమేష్, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు. భీమదేవరపల్లి మండలంలో మొత్తం ఆరు రెవెన్యూ గ్రామాలను భూముల రీ-సర్వే కోసం ఎంపిక చేసినట్లు అధికారులు తెలిపారు. ఇప్పటికే జూలై 28న భీమదేవరపల్లి, జూలై 29న రత్నగిరి, జూలై 31న మాణిక్యాపూర్, ఆగస్టు 1న కొప్పూర్, ఆగస్టు 2న ముస్తఫాపూర్ గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

## రేషన్ కార్డు ఈ-కేవైసీకి మిగిలింది 2 రోజులు మాత్రమే.



**బయ్యారం/,జులై 28.(జర్నలిస్ట్ వార్త)**
రేషన్ కార్డుల ఈ-కేవైసీ పూర్తి చేయడానికి జూలై 31 వరకు మాత్రమే గడువు ఉందని తహసీల్దార్ నాగరాజు అన్నారు. ఈ ప్రక్రియ పూర్తి చేయకపోతే రేషన్ సరుకులు నిలిచిపోయే అవకాశం ఉందని,రేషన్ కార్డుదారులు ఈ-కేవైసీకి 2 రోజులు మాత్రమే మిగిలి ఉందని ఈ రెండు రోజుల్లో ఈ-కేవైసీ చెయ్యని వారు సమీపంలోని రేషన్ షాప్ ను సంప్రదించి బయోమెట్రిక్ వేలిముద్ర ద్వారా ఈ-కేవైసీ పూర్తి చేయాలన్నారు. గడువులోగా ఈ-కేవైసీ చేయించకపోతే రేషన్ పంపిణీలో ఇబ్బందులు తలెత్తుతాయని అధికారులు అంటున్నారు.

## యశోద ఆసుపత్రిలో పెద్ది సుదర్శన్ రెడ్డిని పరామర్శించిన మంత్రి పొంగులేటి..

**కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి,వైద్యులతో చికిత్స వివరాలపై ఆరా..**





**హైదరాబాద్,జూలై 28 (జర్నలిస్ట్ వార్త):** మాజీ ఎమ్మెల్యే, తెలంగాణ రాష్ట్ర సివిల్ సప్లైస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పెద్ది సుదర్శన్ రెడ్డి సికింద్రాబాద్ యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నేపథ్యంలో రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార & పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మంగళవారం ఆసుపత్రికి వెళ్లి ఆయన ఆరోగ్య పరిస్థితిని పరామర్శించారు. ఈ సందర్భంగా పెద్ది సుదర్శన్ రెడ్డిని ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న మంత్రి అనంతరం వైద్యులతో మాట్లాడి అందిస్తున్న చికిత్స,ఆరోగ్య పురోగతిపై వివరాలు తెలుసుకున్నారు.
అనంతరం పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబ సభ్యులను కలిసి వారికి ధైర్యం చెప్పారు. అత్యుత్తమ వైద్య సేవలు అందుతున్నాయని,ఆయన త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి ప్రజల మధ్యకు రావాలని ఆకాంక్షిస్తున్నట్లు మంత్రి పొంగులేటి తెలిపారు. కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని,రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు.

## హైదరాబాద్ లో భారీవర్షం




**హైదరాబాద్జూలై 28 (జర్నలిస్ట్ వార్త):**
హైదరాబాద్ నగరంలో మంగళవారం సాయంత్రం ఒక్కసారిగా భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం నుంచి ఆకాశం పూర్తిగా మేఘావృతం కాగా ఒక్కసారిగా వర్షం మొదలైంది. మొదట రాజేంద్ర నగర్లో ప్రారంభమైన వాన క్రమంగా నగరమంతా విస్తరిస్తూ వచ్చింది. అక్కడక్కడా భారీగా, కొన్ని చోట్ల మోస్తరుగా కురుస్తూ భాగ్యనగరాన్ని తడిపేసింది.ఒక్కసారిగా కురిసిన భారీవర్షంతో రహదారులు జలమయమయ్యాయి. పలుచోట్ల డ్రైనేజీలు పొంగి పొర్లుతున్నాయి. పలు ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండటంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ముషీరాబాద్లో అత్యధికంగా 31 మిల్లీమీటర్ల వర్షం కురిసింది.మాదాపూర్, గచ్చిబౌలి రాయదుర్గం ప్రాంతాల్లో సాయంత్రం నుంచి కురుస్తున్న వర్షానికి రోడ్లు జలమయమయ్యాయి. వాన నీటితో రోడ్లు మునగడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. మాదాపూర్, కేపీహెచ్బీ మార్గంలో, మాదాపూర్ ఐకియా బయోడైవర్సిటీ మార్గంలో గచ్చిబౌలి రాయదుర్గం మార్గంలో వాహనాలు నెమ్మదిగా కదులుతున్నాయి. కిలోమీటర్ దూరానికి గంట సమయం పడుతోంది.
రాజేంద్రనగర్, అత్తాపూర్, హైదర్గూడా, ఉప్పరపల్లి, లంగర్హౌస్, కార్వాన్ తదితర ప్రాంతాల్లో వర్షం దంచికొట్టడంతో రహదారులు జలమయమయ్యాయి. ఇదే సమయంలో కార్యాలయాలు ముగిసే వేళ కావడంతో రోడ్లపై నీరు నిలిచి చెరువుల్లా మారాయి. దీంతో ట్రాఫిక్ ఎక్కడికక్కడ నిలిచిపోయి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.
ప్రధాన కూడళ్ల వద్ద ట్రాఫిక్ నెమ్మదిగా సాగగా, ద్విచక్ర వాహనదారులు వర్షంలో తడుస్తూ గమ్యస్థానాలకు చేరుకునేందుకు ఇబ్బందిపడ్డారు. హైదర్గూడా టీవీఎన్ఆర్ ఎక్స్ప్రెస్ హైవే ఫ్లైఓవర్ కింద, పిల్లర్ నంబర్216 సమీపంలో రోడ్డుపై భారీగా వర్షపు నీరు నిలిచిపోయింది. దీంతో ఆ మార్గంలో ట్రాఫిక్ నెమ్మదిగా సాగుతోంది.
కేపీహెచ్బీ, నిజాంపేట్, బాచుపల్లి, ప్రాంతాల్లో ట్రాఫిక్ నెమ్మదిగా సాగుతోంది. ట్రాఫిక్ సమస్యలతో చాలామంది మెట్రోను ఆశ్రయించారు. దీంతో మెట్రో రైళ్లు, స్టేషన్లు ప్రయాణికులతో కిక్కిరిసిపోయాయి. కోఠిలో భారీ వర్షం పడడంతో రహదారులపై భారీగా నీరు చేరి ట్రాఫిక్ జామ్ అయ్యింది. ట్రాఫిక్లో అంబులెన్స్ కొద్దిసేపు చిక్కుకుపోయింది.
దిల్సుఖ్నగర్ ప్రాంతంలో దంచికొడుతున్న వర్షంతో ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచి పోతున్నాయి. దిల్సుఖ్నగర్, కొత్తపేట, సరూర్ నగర్, కర్మాన్ ఘాట్, మలక్పేట్, చాదర్ ఘాట్ పరిసర ప్రాంతాల్లో కురుస్తున్న వర్షంతో పలు రహదారులు జలమయమయ్యాయి. ముఖ్యంగా చాదర్ఘాట్ నుంచి మలక్పేట్ రైల్వే అండర్పాస్ వరకు భారీ ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. చాదర్ఘాట్ నుంచి మలక్పేట్ రైల్వే అండర్పాస్ వరకు వాహనాలు కిలోమీటర్ల మేర బారులు తీరాయి. అప్రమత్తంగా ఉండాలని ట్రాఫిక్ పోలీసులు సూచనలు చేశారు.

# తాటికాయల వాగులో మళ్లీ ఇసుక మాఫియా దందా

**జేసీబీలతో అక్రమ తవ్వకాలు.. ప్రభుత్వ ఆదాయానికి గండి -అధికారులకు తెలిసినా చర్యలు లేవంటూ గ్రామస్తుల ఆరోపణ**



**ధర్మసాగర్/హనుమకొండ బ్యూరో జూలై 28 (జర్నలిస్ట్ వార్త)**
హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలంలోని తాటికాయల గ్రామ శివారులోని వాగులో ఇసుక మాఫియా మళ్లీ చెలరేగిందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గత కొంతకాలంగా ఎలాంటి అనుమతులు లేకుండానే జేసీబీ యంత్రాల సహాయంతో భారీ ఎత్తున ఇసుకను తవ్వి తరలిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారని వారు పేర్కొంటున్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం అక్రమ ఇసుక తవ్వకాలపై ఉక్కుపాదం మోపడంతో అనేక గ్రామాల్లో ఇసుక తవ్వకాలు నిలిచిపోయాయి. అయితే ప్రస్తుతం ఇసుకకు మార్కెట్లో భారీ డిమాండ్ ఉండటాన్ని అవకాశంగా మలుచుకున్న కొందరు అక్రమార్కులు తాటికాయల వాగులో మళ్లీ యంత్రాలతో ఇసుకను తవ్వి ట్రాక్టర్లు, ఇతర వాహనాల ద్వారా తరలిస్తున్నట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. రెవెన్యూ, పోలీసు అధికారులకు ఈ అక్రమ తవ్వకాల విషయం తెలిసినా పట్టించుకోవడం లేదని, "మమ్మల్ని ఎవరూ ఏమీ చేయలేరు" అనే ధీమాతో ఇసుక మాఫియా దందా కొనసాగిస్తున్నారని గ్రామస్తులు విమర్శిస్తున్నారు. అక్రమ తవ్వకాల వల్ల ప్రభుత్వానికి భారీగా ఆదాయ నష్టం వాటిల్లడంతో పాటు వాగు సహజ స్వరూపం దెబ్బతింటోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తాటికాయల వాగులో జరుగుతున్న అక్రమ ఇసుక తవ్వకాలపై వెంటనే దాడులు నిర్వహించి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు సంబంధిత రెవెన్యూ, గనుల శాఖ, పోలీసు అధికారులను



కోరుతున్నారు. ఇట్టి విషయంపై తాటికాయల జి పి ఓ సయ్యద్ జాకీర్ హుస్సేన్ ను వివరణ కోరగా అక్రమంగా ఇసుక తరలిస్తున్నారని ఇప్పటివరకు మాకు ఎలాంటి సమాచారం లేదు అక్రమ ఇసుక తరలిస్తే పై అధికారులకు తెలియజేసి కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు

# బాల్యం సురక్షితమేనా...?

**నమ్మకమే భయంగా మారితే...!**
**నాలుగేళ్ల చిన్నారిపై వేధింపుల యత్నం ఆరోపణలు..**
**ప్రధానోపాధ్యాయుడు రిమాండ్‌కు**
**పాఠశాలలో విలువలు చెప్పాల్సిన వ్యక్తిపైనే కేసు..**
**చిన్నారుల భద్రతపై మళ్లీ ఆందోళన**



**వర్ధన్నపేట/ జూలై 28 (జర్నలిస్ట్ వార్త):**
నాలుగేళ్ల చిన్నారి అమాయకత్వం. తల్లిదండ్రుల నమ్మకం. సమాజం భుజాలపై ఉన్న బాధ్యత. అయితే ఈ మూడు ఒకేసారి ప్రశ్నార్థకంగా మారేలా వర్ధన్నపేట మండలంలో చోటుచేసుకున్న ఘటన కలకలం రేపుతోంది. పిల్లలకు విద్య, సంస్కారం నేర్పాల్సిన బాధ్యతలో ఉన్న ఓ ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడిపైనే నాలుగేళ్ల బాలికపై లైంగిక వేధింపులు, అత్యాచార యత్నానికి పాల్పడ్డారనే ఆరోపణలు రావడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. పోలీసుల కథనం ప్రకారం, వర్ధన్నపేట మండలం బండౌ అతపురం గ్రామానికి చెందిన తాటికాయల భాస్కర్ (50) జాఫర్ఘడ్ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. ఈ నెల 26న మధ్యాహ్నం సుమారు 2.30 గంటల సమయంలో అదే గ్రామానికి చెందిన నాలుగేళ్ల బాలిక ఆడుకుంటూ ఆయన ఇంట్లోకి వెళ్లినట్లు సమాచారం. కొంతసేపటి తర్వాత చిన్నారి కనిపించకపోవడంతో తల్లి వెతుకుతూ వెళ్లగా, చిన్నారితో అసభ్యంగా ప్రవర్తిస్తూ, ఆమె ప్రైవేట్ భాగాలను తాకుతూ అత్యాచార యత్నానికి పాల్పడినట్లు కుటుంబ సభ్యులు ఆరోపించారు. అనంతరం చిన్నారి తన తల్లికి జరిగిన విషయాన్ని చెప్పడంతో వారు పోలీసులను ఆశ్రయించినట్లు తెలిసింది. ఫిర్యాదు ఆధారంగా పోలీసులు పోక్సో చట్టంలోని సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదు చేసి, నిందితుడిని అరెస్టు చేశారు. అనంతరం కోర్టులో హాజరుపరచగా రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. కేసు దర్యాప్తు కొనసాగుతోంది.

**ఇది ఒక్క కుటుంబం సమస్య కాదు. సమాజానికి హెచ్చరిక**

పిల్లలు అత్యంత సురక్షితంగా ఉండాల్సిన ప్రదేశం ఇల్లు, పాఠశాల, పరిచయస్తుల ఇళ్లు. అలాంటి చోట్లే ఇలాంటి ఆరోపణలు వెలుగుచూడడం సమాజాన్ని కలవరపెడుతోంది. పరిచయం ఉన్నవారే కాబట్టి ప్రమాదం ఉండదు అనే భావనను తల్లిదండ్రులు పునఃపరిశీలించాల్సిన అవసరం ఉందని బాలల హక్కుల కార్యకర్తలు అభిప్రాయపడుతున్నారు. పిల్లలకు నేర్పాల్సింది పాఠాలు మాత్రమే కాదు. రక్షణ కూడాపిల్లలకు మంచి స్పర్శచెడు స్పర్శ గురించి వారి వయసుకు తగిన రీతిలో అవగాహన కల్పించడం, ఏదైనా అసౌకర్యం కలిగితే వెంటనే తల్లిదండ్రులకు లేదా నమ్మకమైన పెద్దలకు చెప్పాలని నేర్పించడం కాలం విధించిన అవసరంగా మారింది.

**చట్టం కఠినమే. కానీ అప్రమత్తత ఇంకా ముఖ్యం**

చిన్నారులపై లైంగిక నేరాలను అరికట్టేందుకు పోక్సో చట్టం కఠినమైన నిబంధనలను కలిగి ఉంది. అయినప్పటికీ, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే కుటుంబం, పాఠశాల, సమాజం, ప్రభుత్వ యంత్రాంగం కలిసి చిన్నారుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు.

# రీసర్వేకు కలెక్టర్లు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి

**భూ వివాదాల్లేని తెలంగాణ నిర్మాణంలో రీ-సర్వే కీలక ఘట్టం**
**ప్రజలకు పూర్తి అవగాహన కల్పిస్తూ గ్రామసభలు నిర్వహించాలి**
**నిర్ధేశిరచిన గడువులోగా రీసర్వే పూర్తి చేయాలి**
**అధికారులకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశం**



**హైదరాబాద్,జూలై 28 (జర్నలిస్ట్ వార్త):** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన భూముల రీ-సర్వే కార్యక్రమాన్ని అత్యంత ప్రాధాన్యతతో అమలు చేసి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార / పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు ప్రతి భూమికి స్పష్టమైన హద్దులు, ప్రతి సర్వే నంబర్‌కు భూదార్ గుర్తింపు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. మంగళవారం సచివాలయంలోని తన కార్యాలయంలో రీ-సర్వే జరుగుతున్న గ్రామాల్లో పురోగతి, ప్రజల స్పందన, ఎదురవుతున్న సమస్యలు, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై రెవెన్యూ, సర్వే అధికారులతో మిక్షించారు. సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా తొలి దశలో జిల్లాకు 70 గ్రామాల చొప్పున ఎంపిక చేసిన 2,240 గ్రామాల్లో రీ-సర్వే కార్యక్రమం కొనసాగుతోందన్నారు. ఈ రీసర్వేపై ప్రజల్లో పూర్తి అవగాహన కల్పించేందుకు ప్రతి గ్రామంలో గ్రామసభలు నిర్వహించాలని, రీ-సర్వే వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు, భూ యజమానులకు వివరించాలని అధికారులకు సూచించారు. ప్రజల సహకారంతోనే ఈ కార్యక్రమం విజయవంతమవుతుందని తెలిపారు. రీ-సర్వే జరుగుతున్న ప్రతి గ్రామంలో అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని, ప్రజలు వ్యక్తం చేసే సందేహాలను వెంటనే నివృత్తి చేయాలని మంత్రి గారు ఆదేశించారు. భూముల హద్దుల నిర్ధారణలో పారదర్శకత పాటిస్తూ ప్రతి దశలో ప్రజలను భాగస్వాములుగా చేయాలని సూచించారు. రీ-సర్వే పనులను కలెక్టర్లు స్వయంగా పర్యవేక్షించాలని, వారానికోసారి పురోగతిని సమీక్షించాలని ఆదేశించారు. రెవెన్యూ, సర్వే శాఖ అధికారులు పూర్తి సమన్వయంతో పనిచేసి నిర్ణీత లక్ష్యాలను సాధించాలని చెప్పారు. ఎక్కడైనా సమస్యలు తలెత్తితే వెంటనే ప్రభుత్వ దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు. భూమి రైతుకు కేవలం ఆస్తి మాత్రమే కాదని, అది కుటుంబ జీవనాధారమని పేర్కొన్న మంత్రి, దశాబ్దాలుగా కొనసాగుతున్న భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపేందుకే ప్రభుత్వం అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రీ-సర్వే చేపట్టిందన్నారు. డీజీపీఎస్, రోవర్స్, జీఐఎస్ వంటి ఆధునిక సాంకేతికత తో శాస్త్రీయ పద్ధతిలో సర్వే నిర్వహించడం వల్ల ప్రతి కమతానికి ఖచ్చితమైన హద్దులు నిర్ణయించబడ తాయని తెలిపారు. రీ-సర్వే పూర్తయిన అనంతరం ప్రతి సర్వే నంబర్‌కు ప్రత్యేక భూదార్ నంబర్ కేటాయించి, భూ భారతి పోర్టల్‌లో నమోదు చేయడం ద్వారా భూముల యాజమాన్యంపై శాశ్వత స్పష్టత ఏర్పడుతుందని మంత్రి తెలిపారు. దీనివల్ల భూ రిజిస్ట్రేషన్లు, మ్యుటేషన్లు మరింత పారదర్శకంగా, వేగవంతంగా జరుగుతాయని చెప్పారు. ఈ కార్యక్రమాన్ని అధికారులు కేవలం ప్రభుత్వ విధిగా కాకుండా ప్రజల జీవితాలను ప్రభావితం చేసే కీలక బాధ్యతగా భావించి అంకితభావంతో పనిచేయాలని మంత్రి పొంగులేటి సూచించారు. ప్రభుత్వం నిర్దేశిరచిన లక్ష్యాల మేరకు రీ-సర్వేను విజయవంతంగా పూర్తి చేసి, భూ వివాదాల్లేని తెలంగాణ నిర్మాణానికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. నక్షా లేని 373 గ్రామాల్లో కూడా రీసర్వే చురుకుగా సాగుతోందని వీలైనంత త్వరితగతిన సర్వేను పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఆయా గ్రామాల్లో అధికారులు సర్వేకు వెళ్లినప్పుడు ముందుగానే పట్టాదారులకు విధిగా నోటీసులు ఇవ్వాలని అదేవిధంగా ఆ గ్రామంలో ప్రభుత్వ భూములకు మార్కింగ్ చేయాలని గ్రామకంఠం హద్దులను నిర్ణయించిన తర్వాతే సర్వే చేపట్టాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా వారు సంతృప్తి చెందేలా సర్వే చేపట్టాలని ఏది చేసినా ప్రజా కోణంలోనే చేయాలని అన్నారు.